
తెలుగు కళాసమితి న్యూజెర్సీ కథ

# అంతశ్శత్రువు

— బెహరా వెంకటసుబ్బారావు



"నమస్తే సర్!" స్త్రీ కంఠం విన్పించగానే ఏదో పుస్తకం చదువుతూన్న లెక్చరర్ చైతన్య తలెత్తి గుమ్మం వైపు చూసాడు. ఎదురుగా తన స్టూడెంట్ రాణి చేతిలో పుస్తకంతో కన్పించింది. ఆమె వెనుకనే మరొక అమ్మాయి గది గుమ్మం దాటి లోనికి ప్రవేశిస్తోంది సంకోచిస్తూ. ఆమె కూడా చైతన్యకి నమస్కారం చేసింది నమ్రతగా.

"ఈమె మా దొడ్డమ్మ కూతురు. పేరు సౌందర్య!" తన వెనుకనే వస్తూన్న అమ్మాయిని చూపిస్తూ పరిచయం చేసింది రాణి.

"రండి! కూర్చోండి" అంటూ ఎదురుగా వున్న సోఫా చూపాడు చైతన్య.

"నాలాగే ఫైనలియర్ చదువుతోంది. నా గ్రూపే!" సోఫాలో కూర్చుంటూ చెప్పింది రాణి. ఆ అమ్మాయిని చూస్తూ అన్నాడు చైతన్య—

"సాధారణంగా తల్లిదండ్రులు పిల్లలకి తమ తమ తల్లిదండ్రుల పేర్లు పెడతారు. అలా కాకుండా మీ సిస్టర్ మొహం చూసి ఆ పేరు పెట్టివుంటారు!" అతని కామెంట్‌కి సిగ్గుతో ముడుచుకుపోయింది సౌందర్య.

"నీ మ్యారేజీ పదిహేనో తేదీన కదూ!" రాణిని అడిగాడు. పక్కింటి అమ్మాయీ, పది సంవత్సరాల నుండీ పరిచయం వుండడం వల్ల రాణి దగ్గర చైతన్యకి చనువు ఎక్కువ. అదీగాక ఆమె తన స్టూడెంట్ కూడా.

"అవును సార్! ఇంక అయిదు రోజులే వుంది. ఎకనామిక్స్‌లో నేను కొంత పూర్ కదా! కొన్ని సందేహాలు తీర్చుకొందుకు వచ్చాను సార్! ఈ మూడు రోజులూ కాలేజీకి శలవులు కదా! అందుకని మీ కభ్యంతరం

లేకపోతే ఈ మూడు రోజులూ వస్తాం. మా సిస్టర్ కూడా వస్తుంది!" తాము వచ్చిన పని చెప్పింది రాణి.

"నిరభ్యంతరంగా రావచ్చు!" తన అంగీకారాన్ని తెలిపాడు చైతన్య.

ఆ మూడు రోజులూ రాణి, సౌందర్య లిద్దరూ చైతన్య దగ్గర కొచ్చి తమ డౌట్స్‌ని క్లియర్ చేసుకున్నారు. తెలియని విషయాలు తెలుసుకున్నారు. మూడో రోజున ఆ ఇద్దరూ గది గుమ్మం దాటి వెళ్తుంటే వెనుకనే వెళ్ళాడు చైతన్య. ముందు హాలులో చైతన్య తల్లి అనూరాధ, రాణి తల్లి అన్నపూర్ణ, మరో ఇద్దరు అపరిచిత వ్యక్తులు సోఫాలో ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకొంటూ కన్పించారు.


"వస్తాం మాష్టారూ!" ఆ ఇద్దరు స్టూడెంట్స్ తమ ఇంటికి వెళ్ళారు.

"రా బాబూ! నీ కోసమే చూస్తున్నాం!" అంటూ తనయుణ్ణి దగ్గరకు పిలిచింది చైతన్య తల్లి అనూరాధ. దగ్గరగా వెళ్ళి ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాడు చైతన్య. ఎదురుగా వున్న నలుగుర్నీ పరిచయం చేసింది తల్లి.

"ఈమె నీకు తెల్సు. రాణి తల్లి అన్నపూర్ణగారు! వీరు రాణి దొడ్డమ్మగారు! విశాఖపట్నంలో వుంటున్నారు. ఈయన వీరి తండ్రిగారు! రాణి తాతగారు!" ఆ ముగ్గురికి నమస్కరించాడు చైతన్య. "మా రెండో అబ్బాయి! పేరు చైతన్య. కాలేజీ లెక్చరర్!" చెప్పింది అనూరాధ వారితో.

"ఎలా వుంది బాబూ అమ్మాయి?" కొడుకుని అడిగింది అనూరాధ.

"తాను ఎకనామిక్స్‌లో పూరని రాణి అనుకొంటోందిగానీ ఫర్వాలేదమ్మా! ఎబౌ ఏవరేజ్ స్టూడెంట్! పెళ్ళయ్యాక కూడా కాస్త శ్రద్ధగా చదివితే క్లాసు రావచ్చు!" చెప్పాడు చైతన్య. "నేనడిగింది రాణి గురించి కాదురా! ఆ రెండో అమ్మాయి సౌందర్య అంటే వీళ్ళ అమ్మాయి





గురించి!" అని తల్లి అనడంతో వివరంగా చెప్పాడు చైతన్య.

"రాణి ప్రశ్నలకు జవాబులు ఆమే చెప్పిందమ్మా! ఆమె సందేహాలను సౌందర్యే నివృత్తి చేసింది. నేను చెప్పింది ఏమీ లేదు! మా ముగ్గురి, ముందూ నిజానికి ఈ మూడు రోజులూ డిస్కషన్సే జరిగాయ్! సౌందర్య ఈజె వెరీ బ్రైట్ స్టూడెంట్! అలాంటి స్టూడెంట్ మా క్లాసులో ఒక్కరైనా లేనందుకు నాకు అసూయగా వుందమ్మా! డిస్టింక్షన్‌లో పాసవుతుంది! టాప్ రేంక్ తెచ్చుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు!" సౌందర్యపై తన అభిప్రాయం చెప్పాడు. చైతన్య మాటలు ఆసక్తితో వింటున్న ఆ నలుగురిలోనూ సంతోషం, సంతృప్తి వ్యక్తమయ్యాయ్. మళ్ళీ తనయుణ్ణి అడిగింది అనూరాధ.

"నేనడిగింది ఆ అమ్మాయి చదువు గురించి కాదు బాబూ! ఆ అమ్మాయి గురించి. వరుసగా డిస్కషన్స్‌లో మూడు రోజులూ పాల్గొంది కదా! ఆ అమ్మాయి హావభావ ప్రకటనల వల్ల ఆమె వ్యక్తిత్వం నీకు అవగాహన అయ్యే వుంటుంది. ఆ అమ్మాయి గురించి నీ అభిప్రాయం చెప్పాలి!"

"అంటే?" అనుమానంగా అడిగాడు చైతన్య. తక్కిన ముగ్గురూ తనవైపే ఆతృతగా చూస్తుంటే తల్లి ప్రశ్నలోని ఆంతర్యాన్ని అర్థంచేసుకున్నాడు చైతన్య. తనయుడు మౌనం వహించడంతో మళ్ళీ అడిగింది తల్లి.

"పెళ్ళిచూపులు పెద్దల మధ్య యువతీయువకులను కూర్చోబెట్టి చూసుకోమంటే ఇద్దరికీ ఇరకాటంగా వుంటుందనీ, ఫ్రీగా మాట్లాడుకునే అవకాశం వుండదనీ అంటూ వుంటావ్ కదా! అందుకే ఈ ఏర్పాటు చేశాను. నిజానికీ విషయం రాణీ, సౌందర్యలకు తెలియనే తెలియదు. సౌందర్యని బలవంతంగా రాణికి తోడు అనే నెపంతో పంపాం! సైకాలజీ కూడా తెలిసినవాడివి! సౌందర్యపై నీ కేర్పడిన అభిప్రాయం చెప్పాలి! సౌందర్య నాకు నచ్చింది! వాళ్ళ నాన్నగారు రాణి పెళ్ళికి ఎల్లుండి వస్తారుట! నువ్ 'ఊ' అంటే ఆయనతో మాట్లాడవచ్చు!" అని ఆగింది అనూరాధ. చైతన్య సమాధానం




కోసం ఆ ముగ్గురులోనూ వున్న ఆతృత కొట్టవస్తున్నట్టు కన్పిస్తోంది.

"నీకు నచ్చితే నాకూ ఇష్టమేనమ్మా! అయినా సౌందర్యలో తిరస్కరించాల్సిన అనర్హతలూ, లోపాలూ ఏవీ లేవమ్మా!" అతని మాటలకంతా ఆనందంతో తబ్బిబ్బయ్యారు.

"చాలా సంతోషం బాబూ! మా అల్లుడుగారు వైజాగ్ నుంచి ఎల్లుండి వస్తారు. కట్నకానుకల విషయాలు మాట్లాడుకోవచ్చు! వచ్చే నెల్లో మంచి ముహూర్తాలున్నాయి. వివాహాల్లోనే సంబంధాలు కుదుర్తాయని పెద్దలన్న మాట అక్షరాలా నిజం అయింది!" సంబరపడ్డాడు సౌందర్యతాతగారు.

ఆ ముసలాయన కట్నకానుకల విషయం ఎత్తేసరికి చీకాకుపడింది అనూరాధ. "ఈ రాజమండ్రిలోనే ఈ మేడ కాక దానవాయిపేటలో మరో బిల్డింగ్ వుంది బాబయ్యగారూ! తర్వాత రావులపాలెం దగ్గర రెండు కొబ్బరి తోటలూ పదిహేనెకరాల మాగాణీ వుంది. మాదే బోలెడంత ఆస్తి. కట్నకానుకలు తీసుకునే ప్రసక్తి లేదు! అందుచేత ఆ విషయాలు మాట్లాడుకోనవసరం లేదు. లాంఛనాలు ఆయా సందర్భాల్లో జరిపించాలి. మా పెద్దబ్బాయి విజయవాడలో బ్యాంకాఫీసర్! పిఠాపురంవారి పిల్లని చేసుకున్నాం. వారు కట్నం ఇస్తామన్నా మావారు తీసుకోలేదు. ఆయన వరకట్న వ్యతిరేకి. ఈ విషయం మీ చిన్నమ్మాయికి కూడా తెలుసు!" అన్న అనూరాధ మాటలకి అమితానందం పొందారా ముగ్గురూ.

"మా అల్లుడుగారు కూడా సంఘంలో గౌరవ ప్రతిష్ఠలున్నవారేనమ్మా! ఆస్తిపాస్తుల విషయంలో మీతో సరితూగలేకపోయినా ఎదురుగా నిలబడగలరు అని చెప్పగలనమ్మా! అబ్బాయికి కట్నరూపంలో ఇవ్వకపోయినా అమ్మాయికి పసుపూ కుంకుమలు నిమిత్తం మా

తృప్తికోసం కొంత ఇచ్చుకుంటాం! కాదనకండి!" ప్రాధేయపడ్డాడు ముసిలాయన.

"అది కూడా అబ్బాయి అంగీకరిస్తేనే!" అనూరాధ మాటలు వారికి ఊరటకలిగించాయ్.

***

సాయంకాలం ఆరున్నర అయింది. చైతన్య స్నేహితునికి రాత్రి పది గంటలకు కాకినాడలో పెళ్ళి. ప్రయాణానికి సిద్ధమవుతుండగా అక్కనీ, బావనీ, తండ్రినీ వెంటబెట్టుకొని వచ్చింది అన్నపూర్ణమ్మ. అంతా సోఫాల్లో కూర్చున్నారు. ముసలాయన అల్లుణ్ణి పరిచయం చేశాడు.

"వీరు మా పెద్దల్లుడుగారు! పేరు లోకకళ్యాణమూర్తి! విశాఖపట్నంలో జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో పన్జేస్తున్నారు!"

నమస్కార ప్రతినమస్కారాలయ్యాయ్. చైతన్యనూ, వారి సౌభాగ్యాన్నీ చూసి సంబరపడ్డాడు లోకకళ్యాణమూర్తి. కాబోయే మామగారితో అన్నాడు చైతన్య –

"మనం ఓ సందర్భంలో కలుసుకున్నాం!" అని. జ్ఞప్తికి రాక నొచ్చుకున్నాడు లోకకళ్యాణమూర్తి.

"సారీ! జ్ఞాపకం రావడం లేదు!"

"నా ఫస్ట్ ఎపాయింట్‌మెంట్ ఎలమంచిలి జూనియర్ కాలేజీలో" అన్నాడు చైతన్య.

"అవునండి! మూడు సంవత్సరాల క్రితం ఎలమంచిలిలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేశాను! ఆ తర్వాత ప్రమోషన్ ఇచ్చి జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారు! ఎలమంచిలిలో కలుసుకొని వుంటాం!" నమ్రతగా చెప్పాడు లోకకళ్యాణమూర్తి.

"మా నాన్నగారు రిజిస్ట్రార్ ఆఫీసులో పని చేస్తున్నారు అని మీ అమ్మాయి అంటే యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆఫీసు అనుకున్నా!" తన పొరబాటుని తెలియజేశాడు చైతన్య.

"లేదండి! మా అమ్మాయే మీకు వివరంగా చెప్పలేదు!" అన్నాడు లోకకళ్యాణమూర్తి.

"మా మేనమామగారు ఇల్లు కట్టుకొందుకు స్టేషన్‌కి దగ్గరలో ఓ సైట్ కొన్నారు. ఆ సైట్ రిజిస్ట్రేషన్ కోసం మీ ఆఫీసుకి నేను కూడా వచ్చాను! అప్పుడు కలిశాము" చెప్పాడు.

"అయాం వెరీ సారీ! జ్ఞాపకం లేదండి!" మరోసారి నొచ్చుకున్నాడు కళ్యాణమూర్తి.

"ప్రతిరోజూ ఎందరో పార్టీలు వస్తూ వుంటారు! గుర్తులేకపోవడం సహజం"

ఆ ఇద్దరి సంభాషణలూ చైతన్య తల్లికి కూడా విసుగు కలిగించాయి. అందుకే కలుగజేసుకోకుండా వుండలేకపోయింది.

"బాబూ చైతన్యా!రాత్రి అవుతోంది. వారొచ్చిన విషయంలోకి వద్దాం" అంది.

"రావుగారూ! పెళ్ళి విషయంలో నాకు కొన్ని పాలసీలూ, అభిప్రాయాలూ వున్నాయ్!" అని చైతన్య అంటూంటే మధ్యలో అందుకున్నారు కళ్యాణమూర్తి.

"అలాగేనండి! మావాళ్ళన్నీ విషయాలూ చెప్పారు! మీ పాలసీ ప్రకారమే కానిద్దాం!" అన్నాడు మూర్తి ఉత్సాహంగా.

"మీరు వైజాగ్ వెళ్ళాక వివరంగా లెటరు రాస్తా! ఇప్పుడు మాట్లాడుకుందుకి టైము లేదు. ఈ రాత్రి పది గంటలకి మా ఫ్రెండ్‌కి కాకినాడలో మ్యారేజ్. మరో అరగంటలో కోటిపల్లి బస్ స్టాండ్ నుంచి టాక్సీ బయలుదేరుతుంది. మా ఫ్రెండ్స్ నా కోసం వెయిట్ చేస్తూ వుంటారు" అంటూ లేచాడు చైతన్య.

"మీరు మధ్యాహ్నం వచ్చి వుంటే బాగుండేది అన్నయ్యగారూ!" బాధపడింది అనూరాధ.

"సరే మరోసారొస్తాం!" అంటూ లేచారు ఆ ముగ్గురూ.

***

అనుకొన్నట్టుగానే నాలుగో రోజున చైతన్య నుంచి లెటరు వచ్చింది.



## అతి పెద్ద చెయ్యి!

ఇటలీలోని వెనిస్‌లో ఈ మధ్య అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన జరిగింది. ఎన్నెన్నో అపూర్వమైన చిత్రాలు అక్కడ ప్రదర్శించబడి, అభిమానుల ప్రశంసలను పొందాయి. వాటిల్లో ఒక పెద్ద చెయ్యి, ఒక అతి పెద్ద భవనాన్ని తన పిడికిట బిగించడానికి ప్రయత్నిస్తున్నట్లుగా, ఓ చిత్రకారుడు ఎంతో సహజంగా చిత్రించాడు. ఈ చిత్రం ప్రేక్షకుల అభిమానాన్ని విశేషంగా చూరగొంది!

కొడిమెల శ్రీరామమూర్తి

లోకకళ్యాణమూర్తి ఆత్రుతగా కవరు విప్పి చదవసాగారు.

శ్రీ లోకకళ్యాణమూర్తిగారికి – చైతన్య వ్రాయునది. నాకు కొన్ని పాలసీలూ – అభిప్రాయాలూ వున్నాయని ఆ రోజు మీతో చెప్పాను. వాటిని ఇప్పుడు వివరిస్తున్నా.

స్మగ్లర్లూ, బ్లాక్ మార్కెటీర్లూ, లంచగొండు వుద్యోగులూ, అవినీతిపరులైన ఆఫీసర్లూ – ఇంకా ఇలాంటివారు నా దృష్టిలో సమాజానికే కాదు దేశానికి కూడా అంతర్ శత్రువులు! వీరు తమ వల్ల సమాజానికీ, దేశానికీ ఎటువంటి హాని కలిగినా పట్టించుకోరు! ఇటువంటి ధనార్జనపరుల నుంచి ఎవరైనా ఒక్క రూపాయి అయినా ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ లబ్ధిపొందితే వారు కూడా ఆ నెత్తురు కూడుని భుజించినట్టే అని నా అభిప్రాయం! ఇటువంటివారు సంఘ బహిష్కృతులు కావాలి! ఇది నా ఒక్కడి వల్లా కాదు అని ఏ ఒక్కరూ అనుకోకూడదు! మూడు సంవత్సరాల క్రితం ఎలమంచిలిలో సైటు రిజిస్ట్రేషన్ కోసం మీ ఆఫీసుకి వచ్చాను. ప్రభుత్వ ఫీజు పన్నెండు వందలూ – "మా ఆఫీసు ఫీజు కూడా పన్నెండు వందలు!" కావాలని మీ ఆఫీస్ స్టాఫ్ పట్టుబట్టారు. ఇది అన్యాయమని ఆ సందర్భంలో మిమ్మల్ని ప్రత్యేకంగా మీ రూంలో కలిశాను. అది ఆనవాయితీ! అంతా అలా ఇస్తారు! మీరూ మావాళ్ళు చెప్పినట్టు చేయండి!" అని చెప్పి పంపారు. ఇప్పుడు మీకు జ్ఞాపకం వచ్చి వుండాలి. మీ అమ్మాయి పెళ్ళి ఎంత కట్నం అయినా ఇచ్చుకొని ఘనంగా పెళ్ళిచేసే శక్తిని ఈ సమాజం మీకు సమర్పించింది.

కాదు మీరు సమకూర్చుకున్నారు. పెద్ద సంబంధం తెచ్చుకోవడం మీకు అసాధ్యమైన పని కాదు – క్షమించాలి – ఇట్లు, చైతన్య.

ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు లోకకళ్యాణమూర్తి.

◐